క్లుప్తంగా

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



శివసాయి రామాంజనేయస్వామి దేవాలయంలో బొడ్రాయి ప్రతిష్ఠకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

కర్నూలు: కర్నూలు నగరం 25వ వార్డు పరిధిలోని బిర్లాగడ్డలో ఉన్న శివసాయి రామాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి కర్నూలు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ గోపురం, గుడి ప్రాంగణం, ముఖ ద్వారంతో పాటు ఆర్చీకి పెయింటింగ్ పనుల కోసం టీజీవీ సంస్థల నుంచి రూ.2.50 లక్షలు విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మద్దిలేటి, మధు, సత్యరాజు, నాగరాజు యాదవ్, గున్నా మార్క్, రాజశేఖర్ యాదవ్, మహేష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఓగా పరమేశ్వరరావు

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖ కర్నూలు ఏఓ (ఎక్స్‌పెండేచర్)గా అంకా పరమేశ్వరరావు నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ విజితను నెల్లూరుకు బదిలీ చేయడంతో నంద్యాలలో ఏఏఓగా పనిచేస్తున్న అంకా పరమేశ్వరరావుకు పదోన్నతి కల్పించి ఇక్కడికి బదిలీ చేశారు. దీంతో ఏఓ విజిత ఇక్కడి నుంచి రిలీవ్ కావడంతో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు టౌన్ ఏడీఈ-1 రాజమోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బళ్లారి రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్‌టీఆర్ నగర్, లెప్రసీ కాలనీ, స్కంద హై బిస్కస్, స్కంద లోటస్, ఉల్చాల చౌరాస్తా తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

డాక్టర్స్ కాలనీలోని లేఅవుట్ పరిశీలన

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో సర్వే నంబర్ 154లో ఉన్న లేఅవుట్‌ను గురువారం టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ దేవీ కుమారి పరిశీలించారు. స్థానికంగా నివసించే నాగరాజు అనే వ్యక్తి లేఅవుట్‌లోని ఖాళీ స్థలంలో ఆక్రమణలు చేపడుతున్నారంటూ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం లోకాయుక్త టౌన్ ప్లానింగ్ డైరెక్టర్‌కు నోటీసులు జారీ చేసింది. దీంతో వాస్తవ పరిస్థితులను స్వయంగా పరిశీలించిన రీజనల్ డైరెక్టర్ పూర్తి నివేదికను లోకాయుక్తకు తెలియజేస్తామని వెల్లడించారు.

బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మృతి

కర్నూలు కల్చరల్: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వాహబ్ గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో స్వగృహంలో మృతి చెందారు. ఆయన మృతికి బీజేపీ ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం కో కన్వీనర్ కపిలేశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు హవిలస్‌బాబులు వాహబ్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వాహబ్ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతోపాటు పార్టీ సిద్ధాంతాలను మైనార్టీ వర్గాల్లో ప్రచారం చేశారని గుర్తు చేసుకున్నారు.

కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎమ్) ఆధ్వర్యంలో మోదీ కబడ్డీ జిల్లా స్థాయి టోర్నమెంట్ గురువారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ప్రారంభమైంది. బీజేవైఎమ్ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్ర మోహన్ అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని యువతను ప్రోత్సహించేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. బీజేవైఎమ్ జిల్లా అధ్యక్షులు తలారి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, ప్రధాన కార్యదర్శులు కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం కేసులో మట్కా బీటర్లు అరెస్ట్

కర్నూలు:కర్నూలు నగరం బుధవారపేట కేంద్రంగా కొన్నేళ్లుగా మట్కా నిర్వహిస్తూ అదనపు ఆదాయం కోసం తెలంగాణ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మూడవ పట్టణ పోలీసులు నిఘా వేసి ఇద్దరు పాత నేరస్థులను గురువారం అరెస్టు చేశారు. బుధవారపేటకు చెందిన మీనుగ రాముడు, పిక్కిలి రామకృష్ణ కలసి అబీముబారక్ నగర్ పక్కన గౌరిగోపాల్ ఆసుపత్రి వెనుక హంద్రీ నదిలో మట్కాతో పాటు మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 వేలు నగదు, మట్కా చీటీతో పాటు నాలుగు తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు.

రక్తహీనతకు కళ్లెం

- జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థల్లో బాలికలకు వైద్యపరీక్షలు
- రక్తహీనత ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ మాత్రల పంపిణీ
- మూడు నెలలైనా తగ్గకపోతే ఆసుపత్రికి రెఫర్



బాలికలకు రక్తపరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది(ఫైల్)

కర్నూలు(హాస్పిటల్): అందరిలా ఆటలాడాలంటే నీరసం. కాస్త నడిస్తే కళ్లు తిరగడం. బాలికల్లో ఎక్కువ మందిలో ఈ పరిస్థితి కనిపిస్తోంది. పోషకాహారం తీసుకోకపోవడం, జీవనశైలిలో మార్పుల కారణంగా రక్తహీనత సమస్య వారిని వేధిస్తోంది. కౌమారదశలోని పిల్లల్లో రక్తహీనత(అనిమీయా)ను గుర్తించి సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. విద్యా సంస్థల్లో 10 నుంచి 19 ఏళ్లలోపు బాలికలకు రక్తపరీక్షలు నిర్వహిస్తోంది. ఈ మేరకు జిల్లాలో ఆ వయస్సు ఉన్న బాలికలు మొత్తం 1,41,126 మంది ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 79,245 మందికి పరీక్ష చేయగా 24,059 మందికి స్వల్పంగా, 27,801మందికి మధ్యస్తంగా, 158 మందికి తీవ్రంగా రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, బడిబయట ఉన్న బాలికల్లో 85.42శాతం మందికి పరీక్ష చేయగా 9,470 మందికి స్వల్పంగా, 2,760 మందికి మధ్యస్తంగా, 81 మందికి తీవ్రంగా రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థినుల్లో రక్తహీనతకు కళ్లెం వేసి వారిని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

కౌమార దశలో రక్తహీనత

బాల్యం దశ నుంచి కౌమారదశలోకి వచ్చే పిల్లల్లో ఆకస్మిక పెరుగుదల కారణంగా ఐరన్ లోపం/రక్తహీనతకు గురయ్యే అవకాశం ఉంది. యుక్తవయస్సులోని బాలికలు కూడా వారి రుతుక్రమం కారణంగా రక్తహీనతకు గురవుతారు. ఐరన్ తక్కువగా ఉండే ఆహారం రక్తహీనతకు కారణం అవుతుంది. వీరికి వీక్లీ ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్ సప్లిమెంటేషన్ ద్వారా మాత్రలను అందజేస్తున్నారు. రోజుకు రెండు మాత్రల చొప్పున మూడు నెలల పాటు మింగించి చూస్తారు. అనంతరం మళ్లీ పరీక్ష చేస్తారు. అయినా రక్తహీనత సమస్య తగ్గకపోతే సమస్య ఎందుకు వస్తుందో గుర్తించి ఆసుపత్రికి రెఫర్ చేసి, ఆ మేరకు వైద్యులచే చికిత్స చేయిస్తారు.

రక్తహీనత తీవ్రత ఇలా...

బాలికల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం 8 నుంచి 10 గ్రాములు ఉంటే కొంచెం(మైల్డ్) రక్తహీనతగా, 6 నుంచి 8 గ్రాములుంటే మధ్యస్తంగా, 6 కంటే తక్కువగా ఉంటే మాత్రం దానిని వైద్యులు తీవ్రం(సీరియస్)గా పరిగణిస్తారు. 8 నుంచి 10 శాతం ఉన్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, 6 నుంచి 8 గ్రాములు ఉన్న వారు ఐరన్ సుక్రోజ్ ఇన్‌ఫ్యూజన్ ఇంజెక్షన్లు ఇస్తారు. 6 కంటే తక్కువ ఉన్న వారికి మాత్రం రక్తం ఎక్కిస్తారు.

రక్తహీనతకు కారణాలు

పోషకాహారలోపం, కొన్ని రకాల కిడ్నీ వ్యాధులు, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు, మందుల వాడకం, వంశపారంపర్యంగా వచ్చే తలసీమియా, సికిల్‌సెల్ వ్యాధులు, బోన్‌మ్యారోలో సమస్యలు, పీరియడ్స్ సమయంలో రక్తస్రావం అధికం కావడం.

రక్తహీనత లక్షణాలు

తీవ్రమైన అలసట, నీరసం, కళ్లు తిరగడం, చర్మం పాలిపోవడం, బీపీ తక్కువగా కావడం, గుండె దడ, ఛాతిలో నొప్పి, ఆయాసం, గుండెవాపు రావడం, కాలెయం, ప్లీహంలో వాపు రావడం, మలంలో రక్తం పడటం, నిద్రలేమి వంటి లక్షణాలు ఉంటాయి.

బాలికలందరికీ రక్తపరీక్షలు



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 10 నుంచి 19 ఏళ్లలోపు బాలికలందరికీ ఏఎన్‌ఎంలచే హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎవ్వరికైతే రక్తం తక్కువగా ఉంటే వారికి మూడు నెలల పాటు ఐరన్ ఫోలిక్‌యాసిడ్ మాత్రలు అందిస్తున్నాము. మూడు నెలలు మాత్రలు వాడినా రక్తహీనతలో మార్పు రాకపోతే అవసరమైన పరీక్షలు, చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పంపిస్తున్నాము. అక్కడ వారికి ఎందుకు రక్తహీనత వస్తుందో గుర్తించి చికిత్స చేస్తారు.

–హేమలత, ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

రక్తహీనతను నిర్లక్ష్యం చేయకూడదు



యుక్తవయస్సులోకి వచ్చే బాలికలకు రక్తహీనత ఉండటం సహజం. అలాగని దానిని నిర్లక్ష్యం చేయకూడదు. రక్తహీనతకు సంబంధించిన లక్షణాలు మీలో కనిపిస్తే వెంటనే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. లేకపోతే తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడటంతో పాటు చదువు దెబ్బతింటుంది. భవిష్యత్‌లోనూ వారికి అనారోగ్య సమస్యలు వస్తాయి. వివాహం అయ్యాక గర్భసమయంలోనూ సమస్యలు వెంటాడతాయి. కాబట్టి ముందుగానే వారి పిల్లలకు రక్తహీనత లేకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి.

–డాక్టర్ శిరీషారెడ్డి, గైనకాలజిస్టు, కర్నూలు

సమస్యలపై తక్షణం స్పందించండి

- విద్యుత్ ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారులు నుంచి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సూచించారు. గురువారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ముఖ్యంగా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది పని చేసే ప్రాంతంలో నివాసం ఉండాలని అప్పుడు అంతరాయ సమస్యలు, ఫిర్యాదులు తగ్గుతాయని చెప్పారు. అప్పుడు సంస్థ లక్ష్యాలు చేరుతుందని వెల్లడించారు. స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఇప్పటి నుంచే నెలవారీ బిల్లులు 100 శాతం రాబట్టాలనే టార్గెట్ పెట్టుకోవాలని సూచించారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని ముందుకు పోవాలన్నారు. పాత బిల్లులు, మొండి బకాయిలను ఎలాగైనా రాబట్టాలని, ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో మాట్లాడి వసూలు అయ్యేలా చూడాలని సూచించారు.

ఎగ్జిబిషన్‌తో మానసిక ప్రశాంతత

కర్నూలు(టౌన్): స్థానిక కోట్ల సర్కిల్ విగ్రహం సమీపంలోని మున్సిపల్ ఎగ్జిబిషన్ మైదానంలో ఎస్ఎస్ అండర్ వాటర్ టన్నెల్ ఫిష్ ఎక్స్‌పోను ఎమ్మెల్యే గురువారం రాత్రి ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉండే నగర ప్రజలకు మానసిక ప్రశాంతత కోసం ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. అయితే ఈ ఏడాది ఎగ్జిబిషన్ కొత్త కాన్సెప్టుతో ఏర్పాటు చేసిన ఫిష్ ఎక్స్‌పో అందరిని ఆకర్షిస్తుందన్నారు. 200లకు పైగా చేపలను ప్రదర్శనలో ఉంచారన్నారు.

అన్నదానం మహోన్నతమైనది



వీరశైవ లింగాయత్ అన్నదాన కార్యక్రమానికి హాజరైన పాణ్యం ఎమ్మెల్యే కాటసానిని సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): అన్ని దానాల కంటే అన్నదానం మహోన్నతమైనదని పాణ్యం శాసనసభ్యుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వీరశైవ లింగాయత్ వారు వారం రోజులుగా కర్నూలు శివారులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ దగ్గర శ్రీశైల క్షేత్రం వెళ్లే శివస్వాములు, శివభక్తులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి పాణ్యం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్పొరేటర్లు నారాయణరెడ్డి, శ్వేతారెడ్డిలతో కలసి శివదీక్షస్వాములు, శివభక్తులకు అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. 12 ఏళ్లుగా వీరశైవ లింగాయత్ ఆ శ్రీశైలం వెళ్లే యాత్రికులకు అన్నదానం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం హర్షణీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్‌లు వీరచంద్రారెడ్డి, విశ్వనాథరెడ్డి, రుక్మాంగదరెడ్డి, వీరశైవ లింగాయత్ చైర్మన్ రుద్రగౌడ్, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సత్కరించారు.

18న మహా శివరాత్రి ఉత్సవాలు



అలంకారంలో సాయీశ్వరుడు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరిహర క్షేత్రంలోని భవానీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18వ తేదీన శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖర శర్మ తెలిపారు. ప్రాతః కాలం నుంచి రుద్రాభిషేకాలు, రాత్రి లింగోద్భవ కాల అభిషేకం, 19వ తేదీన స్వామివారికి అన్నాభిషేకం, శివపార్వతులకు గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి పేర్కొన్నారు. 18వ తేదీ ఉదయం గోపూజ, లలితా సుందరేశ్వర స్వామి వార్లకు పంచామృతాభిషేకం, బిల్వార్చన, సాయంత్రం 5 గంటలకు శ్రీ మామిళ్ల పల్లి జగన్మోహన శర్మ ఆధ్వర్యంలో శ్రీ లలితా సుందరేశ్వర స్వామి వార్ల కల్యాణం, 108 కలశాలు, నందికోళ్లతో రథోత్సవం, లింగోద్భవకాలంలో 3.12 కోట్ల వత్తితో ఆకాశ శివ మహా జ్యోతివెలిగించే కార్యక్రమాలు జరుగుతాయన్నారు.
- నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరం ఆవరణలోని సాయీశ్వరాలయంలో 18వ తేదీ తెల్లవారుజామున 4 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అభిషేకాలు జరుగుతాయని సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్ తెలిపారు. అనంతరం యామ పూజలు, భజనలు జరుగుతాయని పేర్కొన్నారు.
- సూర్యనారాయణస్వామి ఆలయం ఆవరణలోని గౌరీశంకర స్వామికి 18వ తేదీ తెల్లవారుజాము నుంచి రుద్రాభిషేకాలు, ఉదయం 11 గంటలకు నవగ్రహ, లక్ష్మీ, గణపతి, మూల మంత్ర సహిత, అఘోర పాశుపత రుద్రహోమం, రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణం, అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో ఘటాభిషేకం, తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు.

19న శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: ఛత్రపతి శివాజీ మహారాజ జయంతి వేడుకలను ఈ నెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు శివాజీ యూత్ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఓల్డ్‌సిటీ బండిమెట్ట వీధిలోని అంబా భవాని ఆలయంలో వేడుకలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. బండి మెట్ట వీధి నుంచి స్వామి వివేకానంద సర్కిల్ వరకు శోభాయాత్ర జరుగుతుందన్నారు.

ఆర్‌యూలో ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలు

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ మంచి ఆర్థిక ప్రవర్తన కలిగి ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎం.జడ్. రెహమాన్ అన్నారు. గురవారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఆర్‌బీఐ దేశ వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తూ మంచి ఆర్థిక ప్రవర్తన వైపు ప్రజలను నడిపించేందుకు అవగాహన కల్పిస్తుందన్నారు. ఆర్‌బీఐ ఫైనాన్షియల్ లిట్రసీ లోగోతో కూడిన టీషర్ట్స్, క్యాప్స్‌ను విద్యార్థులకు అందజేశారు. ఎల్‌డీఎమ్ వెంకట్ నారాయణ, ఆర్‌యూ పూర్వపు రెక్టార్ సంజీవరావు, బ్యాంక్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

పిల్లలకు మెరుగైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్): పోషకాహార లోపాలున్న పిల్లలకు న్యూట్రిషన్ రీహాబిలిటేషన్ సెంటర్(ఎన్‌ఆర్‌సీ)లో ప్రభుత్వం మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని చిన్నపిల్లల విభాగంలో ఉన్న ఎన్‌ఆర్‌సీని సందర్శించారు. అక్కడి రికార్డులు, పిల్లల రిపోర్ట్‌లు, సిబ్బంది హాజరు వివరాలు పరిశీలించారు. ఎన్‌ఆర్‌సీ కేంద్రంలోని సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. సున్నా నుంచి ఐదేళ్లలోపు పిల్లలు తీవ్ర పోషకాహారలోపం, అతి తీవ్ర పోషకాహారలోపం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవడం, రక్తహీనత, ఫిట్స్, న్యూమోనియా తదితర సమస్యలుంటే వెంటనే చిన్నపిల్లల వార్డులోని వైద్యులను కలిస్తే వారు పరీక్షించి ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స అందిస్తారన్నారు. ఆయన వెంట ఎన్‌ఆర్‌సీ కేంద్రం వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ భవాని తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్ల సంక్షేమ సంఘం సభ్యులు

కర్నూలుకల్చరల్:ఓర్వకల్ మండల పరిధి నన్నూరు సమీపంలోని రాగమయూరి గ్రీన్ హిల్స్‌లోని కేఎస్ఆర్ కర్నూలు రెడ్ల సంక్షేమ సంఘం వృద్ధాశ్రమం ప్రాంగణంలో గురువారం శివాలయంలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. కర్నూలు రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రెడ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు పులకుర్తి నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ వైస్ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, జి.పుల్లారెడ్డి స్వీట్స్ అధినేత జి.రాఘవరెడ్డి, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు.

క్రీడాకారులకు అభినందన



క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థి మురళీతో కరస్పాండెంట్ అజ్రా జావీద్



పవర్ లిఫ్టింగ్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన కర్నూలు జట్టును అభినందిస్తున్న డి.వి.ఈ.ఓ జమీర్‌బాషా

కర్నూలు (టౌన్): ఈ నెల 22వ తేదీ బెంగళూరులోని రేవ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ టోర్నమెంటుకు రాయలసీమ యూనివర్సిటీ జట్టు తరపున ఉస్మానియా కళాశాలకు చెందిన ఎం. మురళీ ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థిని గురువారం కళాశాలలోని తన చాంబర్‌లో కరస్పాండెంట్ అజ్రా జావీద్, ప్రిన్సిపాల్ సమీయుద్దీన్ అభినందించారు. మంచి ప్రతిభ చాటి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రఫీక్ అహమ్మద్, పట్టాబి పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్‌షి కర్నూలు..

ఈ నెల 2, 3 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో నిర్వహించిన 66వ ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 అంతర్ జిల్లాల పవర్ లిఫ్టింగ్ టోర్నమెంటులో కర్నూలు జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక జిల్లా వృత్తి విద్యా అధికారి జమీర్ బాషా తన చాంబర్‌లో చాంపియన్‌షిప్ సాధించిన మహేంద్ర (59 కేజీలు), పరదేశ్ ముష్రాఫ్ (83 కేజీలు) విజయ్‌కుమార్, బి.శివ, మారుతి (84 కేజీలు) లిఫ్టర్లను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి పద్మావతి, కోచ్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఈఓ పరీక్షను పకడ్బందీగా నిర్వహించండి

- డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): దేవదాయ శాఖలో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గ్రేడు-3 పోస్టుల భర్తీ కోసం శుక్రవారం నిర్వహించనున్న మెయిన్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా సమన్వయాధికారి, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో జిల్లా సమన్వయాధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇటీవల నిర్వహించిన ప్రిలిమ్స్ పాసైన వారికి మెయిన్స్ నిర్వహిస్తున్నామన్నారు. మెయిన్స్ పరీక్ష కూడా ఆన్‌లైన్‌లోనే అబ్జెక్టివ్ టైప్ విధానంలో ఉంటుందన్నారు. మెయిన్ పరీక్షకు కర్నూలు శివారులోని కేవీసుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షకు 183 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి5 గంటల వరకు జరిగే పరీక్షకు 183 మంది హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ అధికారి ఎస్‌పి రవూఫ్, రెవెన్యూ నుంచి శ్రీదేవి, పరీక్షా కేంద్రం నుంచి నరసింహ పాల్గొన్నారు.

చురుగ్గా ఫొటో ఓటర్ల జాబితా పనులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగర పాలక సంస్థలో ఫొటో ఓటర్ల జాబితా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. త్వరలోనే ఎన్నికల కమిషన్ 42వ వార్డుకు ఎన్నిక నిర్వహించనుంది. అందులో భాగంగానే ఇప్పటికే 42వ వార్డుకు సంబంధించి ఫొటో ఓటర్ల జాబితాను ఈ నెల 17వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో నగరపాలక ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్ కుమార్ గురువారం ఫొటో ఓటర్ల జాబితాను త్వరితగతిన పూర్తి చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ప్రత్యేకంగా అసిస్టెంట్ సిటీ ప్లానర్లు జి.శశిలత, ఎస్.రంగస్వామి, ఎస్.హయత్ మోహిద్దీన్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఈ. దామోదర్, పి.రాధక్రిష్ణ, పి.శబరీష్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ టి.హరిష్ చౌదరిలను నియమించారు. ఒక్క రోజు గడువు ఉండటంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఫొటో ఓటర్ల జాబితా తుది నివేదిక రూపొందిస్తున్నారు.

ఎన్నికల కోడ్ అమలు పకడ్బందీగా చేపట్టాలి : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ సూచించారు. గురువారం సాయంత్రం ఆయన తన చాంబర్‌లో మున్సిపల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడ ఫ్లెక్సీలు, నేతల పోస్టర్లు కనిపించకూడదన్నారు. గోడలపై రాతలు ఉండకూడదన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

సంతోష్‌నగర్‌లో చోరీ

కర్నూలు(టౌన్): నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్‌లో చోరీ జరిగింది. గద్వాలకు చెందిన రామన్నగౌడ్ కర్నూలు నగరంలోని సంతోష్ నగర్‌లో నివసిస్తున్నాడు. ఈనెల 12వ తేదీన తుంగభద్ర బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందాడు. కుమారుడు వీరేష్ గౌడ్ అంత్యక్రియలు నిర్వహించేందుకు గద్వాలకు వెళ్లాడు. ఇంటికి తాళం వేయడంతో గుర్తించిన దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి రూ.లక్ష నగదుతో ఉడాయించారు. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న వీరేష్ గౌడ్ దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సేతు సముద్ర ప్రాజెక్టు చేపట్టాలని...



కర్నూలు చేరిన బైక్ యాత్రికుడు సంజీవి

కర్నూలు(సెంట్రల్): దక్షిణ భారతదేశానికి ఎంతో ఉపయోగమైన సేతు సముద్ర ప్రాజెక్టును తక్షణమే చేపట్టాలని కోరుతూ తమిళనాడుకు చెందిన సంజీవి బైక్ యాత్ర చేపట్టారు. గురువారం యాత్రలో భాగంగా ఆయన కర్నూలు చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం విదేశాల నుంచి నౌకల ద్వారా వచ్చిన సరుకులను దక్షిణ భారతదేశానికి సంబంధించిన వాటిని కోల్‌కతా నుంచి రవాణా చేసుకోవాల్సి ఉందన్నారు. అదే సేతు సముద్ర ప్రాజెక్టును చేపడితే చెన్నై నుంచే దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబర్ దీవులకు పంపవచ్చన్నారు. తద్వారా రవాణా కోసం వందలాది కిలోమీటర్ల దూరం తగ్గిపోగా..48 గంటల సమయం ఆదా అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టుపై దక్షణాదిరాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. కాగా, ప్రజలకు ప్రాజెక్ట్‌పై అవగాహన కోసం బైక్‌యాత్రను 2023 జనవరి 29వ తేదీన చెన్నైలో ప్రారంభించినట్లు చెప్పారు.

పెయ్య దూడల ఉత్పత్తితో పాడి అభివృద్ధి

- జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్): రైతులు పాడిని అభివృద్ధి చేసుకునేందుకు లింగనిర్ధారిత వీర్యం ద్వారా నాటు పశువుల్లోనే మేలు జాతి పెయ్య (ఆడ)దూడలు ఉత్పత్తి చేసుకోవచ్చని, దీనిపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని పశుసంవర్ధకశాఖ గోకులం సమావేశ మందిరంలో వెటర్నరీ పారా సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. లింగనిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల ఆడ దూడలే పుట్టే అవకాశం ఉందని,దీని వల్ల పాడిని వృద్ధి చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. గొర్రెలు, మేకలకు లక్ష్యం మేరకు పీపీఆర్ వ్యాక్సినేషన్ చేయించడంపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో దాదాపు 13 లక్షల సన్న జీవాలను పీపీఆర్ వ్యాక్సిన్ వేయాల్సి ఉందని, వ్యాక్సినేషన్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పశువులు వ్యాధులకు గురైనపుడు వాటి రక్త నమూనాలను నియోజక స్థాయి పశువ్యాధి నిర్ధారణ ల్యాబ్ లకు పంపాలని తెలిపారు. అక్కడ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారించిన తర్వాత శాస్త్రీయమైన చికిత్స అందించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ లేకుండా చికిత్స చేయడం వల్ల ఒక్కోసారి వికటించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కర్నూలు డివిజన్ డీడీ డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ రవిబాబు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఏడీ మల్లన్న పాల్గొన్నారు.